క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది తనిఖీలు


రైళ్లలో తనిఖీ చేస్తున్న జీఆర్పీ సీఐ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ టి.కామేశ్వరరావు, సిబ్బంది ఈ తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్, వివిధ ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సీఐ తెలిపారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 06081001100 6691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరు 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

'ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సీతమ్మధార : ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ అనంత పురం జిల్లాలో చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థినిని అక్కడి కళాశాల యాజమాన్యం ఫీజు కట్టాలని.. లేకపోతే రికార్డులు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురి చేయడంతో కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. అలాగే విశాఖలో నాలుగో వార్డులోని రెసిడెన్షియల్ హాస్టల్లో అమ్మాయి చనిపోయిందన్నారు. వీటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని.. తక్షణమే ఆయా కళాశాలలను సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

స్వచ్ఛత.. బాధ్యత

- చీపుర్లు చేతపట్టిన అధికారులు, ఉద్యోగులు
- స్వచ్ఛసర్వేక్షణ్‌పై వినూత్నంగా అవగాహన



సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డులో శుభ్రం చేస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, సచివాలయ కార్యదర్శులు

గోపాలపట్నం: స్వచ్ఛతను సేవగా భావించాలి.. పరిశుభ్రత భారత్ అందరి లక్ష్యం కావాలి అని జోన్–8 జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు పిలుపునిచ్చారు. సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంపై వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. అధికారులు, ఉద్యోగులు అన్న తేడా లేకుండా చీపుర్లు చేతపట్టారు. పరిసరాలు పరిశుభ్రం చేశారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని కోరారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మల్లయ్య నాయుడు చీరుపు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలు మనం శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరిసరాలు బావుంటేనే మన ఆరోగ్యం బావుంటుందని అన్నారు. మన ఇళ్లు బాగుంటే వీధి, మన వీధి బాగుంటే మన నగరం బావుంటుందని వివరించారు. దుకాణాదారులు తడి పొడి, ప్రమాదకర చెత్త వేయడానికి వేర్వేరుగా డస్ట్ బిన్లు పెట్టాలని సూచించారు. రోడ్లపై, కాల్వల్లో చెత్త వేయవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశాఖను ఉన్నతంగా నిలబెడదాం

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలో విశాఖను ఉన్నతంగా నిలబెడదామని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ సమీపంలోని తోటపోలమాంబ ఆలయం వద్ద బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. జెడ్సీ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, ప్రమాదకర చెత్త వేర్వేరుగా అందించినప్పుడే స్వచ్ఛత సాకారమవుతుందని తెలిపారు. యూజర్ చార్జీలు కట్టి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


చెత్త ఎత్తుతున్న జెడ్సీ మల్లయ్య నాయుడు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది


తోటపోలమాంబ ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

పేదల పక్షపాతి సీఎం జగన్


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఆనంద్‌కుమార్

కంచరపాలెం: గడప గడపకు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం దుర్గానగర్, తోటవీధి సచివాలయాల పరిధిలో బుధవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. నాడు ప్రజల కష్టాలు నేరుగా తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడానికి నేడు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదోడికి అందే విధంగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించవద్దు

జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారుల ర్యాలీ


గోపాలపట్నం బంక్ వద్ద ర్యాలీగా వెళ్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు

గోపాలపట్నం: పాదచారులు ఫుట్‌పాత్‌లపైనే నడవాలి... అందుకు తగిన విధంగా ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉంచాలి అంటూ జీవీఎంసీ జోన్–8 అధికారులు, గోపాలపట్నం ట్రాఫిక్ అధికారులు సంయుక్తంగా బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం వరకు బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు, గ్రీన్ బెల్టులు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారు స్వచ్ఛందంగా బయటకు వెళ్లి పోవాలని కోరారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, తోపుడు బళ్లు పెట్టడం వల్ల పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యంత్రాంగానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రమీల, ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి


56వ వార్డులో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, అధికారులు.


విమాన్‌నగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆనంద్ కుమార్, కార్పొరేటర్ బొమ్మడి రమణ

కంచరపాలెం: నియోజక వర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నామని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తుందని చెప్పారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు రూ 82.48 లక్షలతో ఎఫ్‌సీఐ గిడ్డంగి నుంచి రామూర్తిపంతులుపేట రామాలయం వరకు బీటీ రోడ్డు , కంచరపాలెం వద్ద వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంపై అదనపు భవన నిర్మాణ పనులతో పాట గొల్లకంచరపాలెం సులభ్ కాంప్లెక్స్ వద్ద ప్రభుత్వ స్థలంలో 265, 266 సచివాలయాలకు శాశ్వత భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆనందకుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం అనేక పనులు చేపడుతుందన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేయాలని జోన్–5 ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజశేఖర్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీను, జోన్–5 ఇంజినీరింగ్ విభాగం ఈఈ టి. ప్రసన్నరెడ్డి, డీఈ ఏడుకొండలు, డాక్టర్ మట్టా శశిప్రియాంక, నాయకులు పల్లా ఎర్నికుమార్, ఎస్. సాయిలత, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 90వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ శంకుస్థాపన చేశారు. 90వ వార్డులో రూ.27లక్షలతో కమ్యూనిటీ హాలు అదనపు అంతస్తు, సీసీ రోడ్డు పనులకు, కొత్తపాలెం ప్రధాన రహదారిలో రూ19.90 లక్షలతో డ్రైన్ పనులకు శ్రీకారం చుట్టారు. 90వ వార్డు విమాన్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, యల్లపు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

89వ వార్డులో ప్రధాన రహదారిలో అభివృద్ధి పనులకు ఆనంద్‌కుమార్ శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొడ్డి కిరణ్, నాయకులు ఐతంశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల పైడిరాజు, ఐతంశెట్టి గోపి, రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సర్వీసు రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే మార్గం దుస్థితి

మల్కాపురం: గ్రేటర్ పరిధిలోని ఓ ప్రాంతంలో ఇప్పటికీ మట్టి రోడ్డు ఉంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో కోరమాండల్ సంస్థ రక్షణగోడను ఆనుకుని కోడిపందాలదిబ్బ, శ్రీరామ్ నగర్, శ్రీహరిపురం ప్రాంతాలకు వెళ్లే మార్గం ఉంది. మట్టిరోడ్డు కావడంతో పాటు గోతులు మయంగా ఉండడంతో నిత్యం ఇటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. సమస్యను జీవీఎంసీ ఉన్నతాధికారులకు పలు మార్లు వివరించారు. అయినా నేటికీ స్పందన లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు సమస్యపై స్పందించాలని కోరుతున్నారు.

పురాణేతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలు


కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: పురాణ ఇతిహాసాలు మానవాళి జీవనానికి మార్గదర్శకాలని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మతో కలిసి ఆయన బుధవారం శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు కొద్ది రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ సనాతన పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తుల్లో విశేషమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. ఈ విజ్ఞానం మానవ మనుగడ, జీవన విధానానికి మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. సనాతన ధర్మాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు షణ్ముఖశర్మ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం షణ్ముఖశర్మ ప్రవచనాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి, నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. 108 మంది దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేశారు.

పెన్షనర్స్ హెల్త్ గైడ్ ఆవిష్కరణ



పెన్షనర్స్ హెల్త్‌గైడ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పెన్షనర్స్ అసోసియేషన్ తీర్చిదిద్దిన హెల్త్ గైడ్ హ్యాండ్ బుక్‌ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి వర్సిటీ సెనేట్ మందిరంలో మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయిలో పెన్షనర్లకు ఉపయుక్తంగా నిలిచే అంశాలు, హెల్త్ కార్డులతో పొందే సేవలు, ఉద్యోగులకు, పెన్షనర్లకు సులభంగా సమాచారాన్ని అందించేలా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. ఆస్పత్రులు అందించే సేవలు, సమగ్ర వివరాలు, ఫోన్ నంబర్లు వంటివి ఈ పుస్తకంలో పొందుపరిచారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు గొలగాని అప్పారావు, గౌరవ అధ్యక్షుడు టి.సైదయ్య, జనరల్ సెక్రటరీ సి.నాగేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

వివాహితపై దాడి

గోపాలపట్నం: వివాహితపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సింహాచలంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలివీ.. సింహాచలానికి చెందిన శంభాన దివ్య గోశాల వద్ద కార్ల లోన్లు ఇచ్చే సంస్థలో పని చేస్తోంది. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ అడ్డుపడ్డాడు. తనతో వచ్చేయాలని వేధించాడు. అతన్ని తప్పించుకుని వెళ్లేందుకు యత్నించగా ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె చేతిపై గాయమైంది. మూడు నెలలుగా ఇదే విధంగా చంద్రశేఖర్ వేధిస్తున్నాడని గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

మర్రిపాలెం: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో గంజాయి నిల్వ చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం కప్పరాడ ప్రాంతం ఇంద్రనగర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహ్మద్ అజ్మల్ హక్, సాదికుల్‌ఇస్లాం గుట్టుచప్పుడు కాకుండా 60 కిలోల గంజాయి ఓ ఇంట్లో ఉంచారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను కంచరపాలెం పోలీసులకు అప్పగించారు.

అందరి సహకారంతో స్వచ్ఛత సాకారం


మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అగనంపూడి: స్వచ్ఛ విశాఖలో జీవీఎంసీకి ప్రథమ ర్యాంక్ రావడానికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం కోరారు. జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛతలో తడి పొడి చెత్త భాగమన్నారు. తడి పొడి చెత్తను ఇళ్లలో వేర్వేరుగా నిల్వ చేసి జీవీఎంసీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ విశాఖ సాధ్యమని, తద్వారా ర్యాంకింగ్‌లో విశాఖను అగ్రభాగాన నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనకమహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు సర్వసిద్ధి బొరయ్యనాయుడు, చట్టి తాతారావు శేఖరమంత్రి శ్రీనివాసరావు, వార్డు శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా


బీసీ గేటు వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం ఉదయం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడు తూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ఎన్‌జేసీఎస్‌లో జరిగిన నూతన వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2017 జనవరి 1 నుంచి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, దాలినాయుడు, ఎన్నేటి రమణ, సంపంగి ఈశ్వరరావు, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి కోడె దుర్గాప్రసాద్

సీతంపేట: విశ్రాంత ఐపీఎస్ అధికారి, పూర్వ డీజీపీ కోడె దుర్గాప్రసాద్ బుధవారం విశాఖ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. విద్యార్థులకు, పాఠకులకు చక్కటి వాతావరణం కల్పించారని పౌర గ్రంథాలయ సొసైటీని అభినందించారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మార్గ నిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను వివరించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు

- పాస్ అవుట్ విద్యార్థులు ఉద్యోగాల్లో చేరండి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి


పాల్గొన్న విద్యార్థులు



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, నూతన ఆవిష్కరణలు రూపొందించి పేటెంటు హక్కు పొందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యూబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంవీ రామకృష్ణ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి కాలేజీ ఓఎస్‌డీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వ హించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వంలో ప్రజల గొంతు ప్రతి ధ్వనిస్తుందన్నారు. సహృదయతే విధానమై, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని తన కవిత్వంలో కవి ఆవిష్కరిస్తాడని తెలిపారు.